క్లుప్తంగా

నీటి సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం ప్రధాన రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో మెయిన్ రోడ్డులోని నీటి సరఫరా పైప్ లైన్ రహదారి పక్కకు జరిపే పనులు చేపట్టనున్నందున నేడు (గురువారం) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ కేదార్‌నాథ్ తెలిపారు. ఈ కారణంగా వార్డులోని అన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నందున స్థానికులు సహకరించాలని కోరారు.

చెత్త తరలింపు వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ నుంచి చెత్త తరలింపునకు కొత్తగా ఒక టిప్పర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శుభ్రతకు పెద్దపీట వేయాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య సమాజ స్థాపనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగ

అల్లిపురం: తాకట్టు పెట్టిన బైక్‌ను దొంగతనంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న యువకుడిని టూటౌన్ పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లికి చెందిన షేక్ మీరా చింతపల్లి నుంచి హెచ్‌ఎఫ్ డీలక్స్ బండిపై నగరానికి చేరుకున్నాడు. తన వెంట తీసుకొచ్చిన బండిని పూర్ణామార్కెట్ దరి కల్లుపాకల వద్ద గల పాత టూవీలర్ స్క్రాప్ దుకాణంలో అమ్ముతుండగా సమాచారం మేరకు టూటౌన్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' హార్టికల్చర్ సొసైటీ లావాదేవీలపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ ఉక్కు నిర్వాసితుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఉక్కు హార్టికల్చర్ సొసైటీ, పెదగంట్యాడపై విచారణ చేపట్టి లావాదేవీలను బయటపెట్టాలని విశాఖ ఉక్కు కో ఆపరేటివ్ మాజీ కార్యదర్శి పట్టా రామ అప్పారావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1995లో విశాఖ ఉక్కు నిర్వాసితుల ఉపాధి కోసం ఈ సొసైటీని ప్రారంభించారని, అయితే అప్పట్నుంచి ఒకే బ్యాచ్‌కు చెందిన నిర్వాసితులు కూలి పనులు చేసుకుంటున్నారని తెలిపారు. సొసైటీ సభ్యులకు ఒక్క రూపాయి కూడా డివిడెండ్‌గా చెల్లించలేదని పేర్కొన్నారు. స.హ.చట్టం ద్వారా వివరాలు కావాలని ఉక్కు యాజమాన్యం, జిల్లా సహకార శాఖ, హార్టికల్చర్ సొసైటీని కోరగా.. తమకు సంబంధం లేదని వివరాలు ఇవ్వడానికి వారు నిరాకరిస్తున్నారని తెలిపారు. సొసైటీ ద్వారా నిర్వహించిన కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై సమగ్రంగా విచారణ చేపట్టి, సభ్యులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

శిథిలావస్థలో జీవీఎంసీ భవనాలు

- బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- చెల్లాచెదురైన వివిధ విభాగాలు
- ప్రజల అవస్థలు



శిథిలావస్థకు చేరిన అగనంపూడిలోని జీవీఎంసీ భవనం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని జీవీఎంసీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని ఆనుకుని ఉన్న పాఠశాల భవనాలు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి. జీవీఎంసీలో విలీనం అయ్యేటప్పటి వరకు పంచాయతీ కార్యాలయం నిర్వహించిన ఆవరణాన్ని తరువాత జీవీఎంసీకి అప్పగించారు. ఆరంభంలో జీవీఎంసీ సెక్షన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. తరువాత నీటిసరఫరా, రెవెన్యూ కార్యాలయాలు ఇదే ప్రాంగణంలో కొనసాగాయి. తరువాత ఒక్కో విభాగం ఒక్కో చోటకు తరలిపోవడంతో ప్రస్తుతం శానిటరీ సిబ్బంది, జనన, మరణ ధ్రువీకరణ కేంద్రం మాత్రం కొనసాగుతున్నాయి.

ఈ ప్రాంగణంలోని నీటి సరఫరా విభాగం బీసీ కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో పంప్‌హౌస్‌కి తరలిపోయింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు విద్యుత్ సిబ్బందికి కార్యాలయాలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో శిథిల భవనంలోనే కొనసాగిస్తున్నారు.

- జాతీయ రహదారిని ఆనుకుని జీవీఎంసీ భవనంతో పాటు వాటి పక్కనే మండల పరిషత్ పాఠశాల శిథిల ఆవరణ ఉంది. గతంలో పాఠశాల భవనంలో ఎమ్మార్సీ నిర్వహించేవారు. వడ్లపూడిలో ఎమ్మార్సీ నిర్మాణం తరువాత ఈ భవనం నిరుపయోగంగా మారింది.
- పాఠశాలను పాత గ్రామం సమీపంలోకి తరలించడంతో రెండు భవనాలు నిరాదరణకు గురై శిథిలమైపోయాయి. వీటిని ఆనుకొనే జీవీఎంసీ కార్యాలయం ఉంది.

జీవీఎంసీ రెవెన్యూ, నీటిసరఫరా, విద్యుత్, పారిశుధ్య విభాగాలు చెల్లాచెదురుగా విసిరేసినట్టు ఉండడంతో జీవీఎంసీ సేవలు ప్రజలకు ఒకే చోట అందుబాటులో లేకుండా పోయాయి.

ప్రజలకు దూరాభారం

గాజువాక జీవీఎంసీ కార్యాలయం నుంచి అగనంపూడి పది కిలోమీటర్ల దూరం ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు ఆవరణాల్లోని శిథిల భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మిస్తే ప్రజా సేవలన్నీ ఒకే చోట అందుబాటులో ఉండేందుకు వీలుంటుంది. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. మరోవైపు ఈ భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని అక్కడుంటున్న సిబ్బంది, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన సముదాయం నిర్మించి, అన్ని శాఖల సేవలను ఒకే చోట అందుబాటులోకి తేవాలని కోరారు.

ప్రమాదకరంగా భవనాలు



శిథిల భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం జీవీఎంసీ కార్యాలయం మాకు పది కిలో మీటర్ల దూరంలో ఉంది. విద్యుత్, నీటిసరఫరా, రెవెన్యూ పారిశుధ్య విభాగాలు కూడా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. అన్ని కలిపి ఒకే ఆవరణలో ఉండేలా చూడాలి. –ఎం.శ్రీను, లంకెలపాలెం

ఎప్పుడు కూలిపోతాయో అనే భయం



భవనాలు నేలకూలడానికి సిద్ధంగా ఉండటంతో చాలా భయంగా ఉంటోంది. ప్రస్తుతం కార్యాలయాలే లేని, ప్రజలకు ఉపయోగపడని శిథిల భవనాలను తొలగిస్తే కొంత నిశ్చింత. అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలి. – ఐ.ఎ.రాజు, ఫార్మాసిటీ కాలనీ

అధికారికి అభినందనలు



అడిషనల్ జీఎం (హెచ్ఆర్) లీలకు అభినందనలు తెలుపుతున్న గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ నూతన అడిషనల్ జీఎం (హెచ్ఆర్)గా ఎస్.లీల బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాదు భెల్ యూనిట్ నుంచి బదిలీపై విశాఖ యూనిట్‌కు వచ్చారు. ఆమెను సంస్థ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ప్రతినిధులు కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, ప్రతినిధులు ఎ.వెంకటరావు, గెద్దాడ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- అడిషనల్ జీఎం (హెచ్ఆర్) లీలను సంస్థ సీఐటీయూ నాయకులు కలిసి అభినందించారు. ఆమెను కలిసిన వారిలో సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.విజయ్ కుమార్, ఎస్.అప్పారావు తదితరులున్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత



ప్రసంగిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై పాతకర్ణవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా బాలింతలకు పౌష్టికాహారం, పిల్లలకు పాలు, గుడ్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాగులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఆడపిల్ల పుడితే కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు ఇస్తోందన్నారు. ఆడపిల్లల రక్షణ, విద్య అవసరాన్ని వివరిస్తూ ఈ సందర్భంగా కళాకారులు నృత్య రూపకం ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద అప్పారావు, అంగన్‌వాడీ టీచర్ పూర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పెదగంట్యాడ: మానవాళి మనుగడ మొక్కలతోనే సాధ్యమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరున ఒక మొక్క నాటాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 76వ వార్డు ప్రాథమిక పాఠశాలలో బీజేపీ వార్డు అధ్యక్షుడు జిలకర్ర రమణ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు మనుషులకు ప్రాణ వాయువును అందించడంతో పాటు అనేక విధాలుగా ఉపయోగపడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీను మాట్లాడుతూ గాజువాకలోని అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూటూరు శంకరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ కాన్ఫరెన్స్‌లో నగరానికి చెందిన డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొన్నారు. ఇండియాతో పాటు దుబాయ్, ఇటలీ, సింగపూర్ వంటి దేశాల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఆర్థో, కార్డియో, న్యూరో, స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అపోలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హన్నా రాజశేఖర్, పీఎఫ్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా సమయంలో అందించిన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు

- ప్రతిష్టా ప్రారంభ సంకల్పం నేడు
- 5వ తేదీ రాత్రి విశేష హోమాల నిర్వహణ
- 6న పూర్ణాహుతి, నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశావతారాలు
- 18న తిరుగు రథయాత్ర



సుభద్ర, బలభద్రులతో జగన్నాథస్వామి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 4 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4న గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠాపన సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచ శయ్యాదివాసాలు, 6న ఆషాడ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరుపనున్నారు. 7 ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి దర్శనమిస్తారు.

నిత్యపూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలువు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజలు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథ స్వామి ప్రార్థనా గాన సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తిరుగు రథయాత్ర

18న ఉదయం 9.15 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా నడుమ జగన్నాథుని నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19 ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11,12 తేదీల్లో నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ.. శ్రీకృష్ణావతారాల్లో అలాగే, 17న శేషశయనుడిగా స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన

కంచరపాలెం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, పందిరి కూరగాయల సాగు, మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

నాగుపాము కలకలం



పట్టుకున్న నాగుపాముతో స్నేక్ క్యాచర్ నాగరాజు

సింధియా: డాల్ఫిన్‌నోస్ నేవల్ ఏరియాలోని నేవీ సిబ్బంది గృహ సముదాయాల వద్ద 9 అడుగుల నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని రోడ్డుపై తిరుగుతూ గోడ రంధ్రంలో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్యమైన ప్రదేశంలో విడిచిపెట్టాడు. విషసర్పం కావడంతో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడం అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ పాముల సంచారం కనిపిస్తోందని, వర్షా కాలంలో మరింత అధికంగా ఉంటుందని, తగు నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణం పదిలం



మానవహారంగా ఏర్పడిన గంగవరం హైస్కూల్ విద్యార్థులు

పెదగంట్యాడ: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ మేనేజర్ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇకపై ప్లాస్టిక్ సంచులు వినియోగించమంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

అందరి సహకారంతో ప్లాస్టిక్ రహిత సమాజం



ప్లాస్టిక్ సంచుల నిషేధంపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అధికారులు

అగనంపూడి: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జీవీఎంసీ 85వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామయ్య అన్నారు. వార్డులోని పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిథిన్ నిషేధానికి, పర్యావరణ హితానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అన్నారు. తల్లిదండ్రులకు, పరిసర ప్రాంతవాసులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించి, పాలిథిన్ కవర్లు .. ప్లాస్టిక్ సామగ్రి వాడకం తగ్గించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ఇన్‌చార్జి సంతోష్‌కుమార్, పూడి సత్యారావు, అండిబోయిన జ్యోతి, ఉపాధ్యాయులు కొండబాబు, నాయుడు బాబు, గణపతి, కార్యదర్శులు జాజుల నరేష్, ఎస్.శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళికతో గాజువాక అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, కార్పొరేటర్లు, అధికారులు

గాజువాక: గాజువాక అభివృద్ధికి పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్దామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. దీనికి అధికారులు, వార్డు కార్పొరేటర్లు, ప్రజలు సహకరించాలని కోరారు. గాజువాక అభివృద్ధిపై అధికారులు, కార్పొరేటర్లతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీకి సంబంధించిన వివిధ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల ప్రగతి, చేపట్టబోయే పనుల ప్రతిపాదనలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, క్రీడా మైదానాలు, చెరువులు, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై ఆయన రెండున్నర గంటలపాటు సమీక్ష నిర్వహించారు. హైవేపై డివైడర్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు చెప్పగా, డివైడర్ల కంటే ముందుగా సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. సర్వీస్ రోడ్లను కూడా మాస్టర్ ప్లాన్ ప్రకారం కాకుండా భూసేకరణ ప్రకారం అభివృద్ధి చేయాలన్నారు. గాజువాకలో జాతీయ రహదారి లేదని, ప్రస్తుతం హైవే అనుకుంటున్న రోడ్డును జీవీఎంసీ మెయిన్ రోడ్‌గా భావించాలన్నారు. నీటి సరఫరాపై ప్రత్యేకంగా ఒక సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని, దీనికోసం కొన్ని శాఖలను ప్రక్షాళన చేయాలని అన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ రవికృష్ణ వర్మ, పలువురు వార్డు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మన ప్రాంగణం.. మన బాధ్యత



గోపాలపట్నం రైతు బజారులో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

గోపాలపట్నం: మన ప్రాంగణం... మన బాధ్యత అనే నినాదంతో రైతు బజారులో బుధవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. గోపాలపట్నం రైతు బజారులో రైతులు, వర్తకులు, అధికారులు సంయుక్తంగా ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. మన ప్రాంగణాన్ని మనమే శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బజారు ఈవో నారాయణరావు, సహాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతులు

పోరాట కమిటీ తీర్మానం



పోరాట కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు సెయిల్‌లో విలీనం, ముడి పదార్థాల లభ్యత తదితర అంశాలపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సాధ్యమైనంత త్వరలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో విశాఖ ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లను కలిసి సమస్యలను వివరించనున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలవాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు సహాయమంత్రి బి. శ్రీనివాసవర్మ, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులను కలవనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేసిన కేసు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్. నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.టి.దాస్, వై.మస్తానప్ప, బి.డేవిడ్, పరంధామయ్య, సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు, రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వేపోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతాదళం సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. రాజస్తాన్‌కు చెందిన పరమేశ్వర్‌జాట్, కమలేష్ వైష్ణవ్‌లను, వేరొక కేసులో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రామేశ్వర్‌నాయక్, ప్రతాప్‌నాయక్‌లను తనిఖీలు చేయగా వీరు చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.55 లక్షల విలువైన సుమారు 51 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.